క్లుప్తంగా

వైద్య విజ్ఞాన సదస్సు

కాకినాడ క్రైం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సీఎంఈ(కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) సదస్సు జరిగింది. దివంగత వైద్యుడు డాక్టర్ ఏవీ రెడ్డినాయుడు సంస్మరణార్థం ఈ సదస్సును నిర్వహించారు. ఆయన కుమారుడు, రామ్‌కోశా కార్యదర్శి డాక్టర్ ఆదిత్య సత్యప్రసన్న సహా, రామ్‌కోశా ఐఎంఏ సంయుక్తాధ్వర్యంలో సదస్సు జరిగింది. ప్రముఖ కార్డియాలజీ నిపుణుడు డాక్టర్ సీవీ రావు మాట్లాడుతూ, నాన్ ఇన్‌వాసివ్ టెస్టింగ్ ఫర్ మయోకార్డియల్ ఇస్కీమియా అనే అంశంపై విజ్ఞానపూరిత ప్రసంగమిచ్చారు. గౌరవ అతిథులుగా ఐఎంఏ కాకినాడ ప్రెసిడెంట్ డాక్టర్ మోకా పవన్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ చిట్ల కిరణ్, ట్రెజరర్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాకాడ గ్రామ దేవతల తీర్థం



వాకాడలో సోమాలమ్మ తల్లి, ముసాలమ్మ తల్లి

కరప: మండలంలోని వాకాడ గ్రామ దేవతలు ముసాలమ్మ, సోమాలమ్మ తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముసాలమ్మ, సోమాలమ్మ జాతర, తీర్థం మూడేళ్లకు ఒకసారి ఘనంగా నిర్వహిస్తారు. గ్రామానికి శివారున ఉండే గ్రామ దేవతలు ముసాలమ్మ, సోమాలమ్మను మూడు నెలల ముందుగా గ్రామంలోకి తీసుకొచ్చి రామాలయం వద్ద, పారుగు వీధిలోను తాటాకులపాకలు వేసి ఇద్దరు అమ్మవార్లను నిలిపారు. తర్వాత అమ్మవార్లకు గ్రామోత్సవం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ముసాలమ్మ, సోమాలమ్మకు జాతర జరిపి, రెండో రోజు నిప్పులగుండం తొక్కి గ్రామస్తులు మొక్కులు తీర్చుకుంటారు. శనివారం జాతర, ఆదివారం తీర్థం జరిపి, మూడో రోజున అమ్మవారిని ఊరి చివరకు తీసుకెళ్లి, యథాస్థానంలో ఉంచడంతో తీర్థం ముగుస్తుంది. గ్రామస్తులు తమ బంధువులను, స్నేహితులను, ఇంటి ఆడపడుచులు, అల్లుళ్లను పిలిచి జాతర, తీర్థం ఘనంగా జరిపారు. అడబాల వంశీకులు అమ్మవార్లకు పుట్టిల్లు కాగా, లకమన వంశీకులు అత్తవారింటిగా గ్రామ దేవతలు ముసాలమ్మ, సోమాలమ్మ జాతర, తీర్థం వేడుకగా నిర్వహించారు. ముందుగా సోమాలమ్మ తల్లిని, తర్వాత ముసాలమ్మ తల్లిని దర్శించుకోవడం గ్రామస్తుల ఆచారం. వాకాడ, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తుల వినతి మేరకు 2023లో అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.30 లక్షలు మంజూరు చేయగా, భక్తులు, గ్రామస్తులు ఇచ్చిన విరాళాలతో అమ్మవార్లకు ఆలయ నిర్మాణం చేసినట్టు సర్పంచ్ అడబాల సత్య తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీపుష్పయాగోత్సవం



స్వామివారు, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

సామర్లకోట: పురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణ స్వామి శ్రీపుష్పయాగోత్సవం ఆదివారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ఈ నెల 7వ తేదీ నుంచి ఆలయంలో స్వామివారి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమైన విషయం విదితమే. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల శ్రీపుష్ప యాగోత్సవం నిర్వహించారు. ఆలయ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై పట్టు వస్త్రాలతో అలంకృతులైన స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయ పండితులు పూజలు చేశారు. ఖండవిల్లి దుర్గప్రశాంతాచార్యులు, చక్రవర్తుల రవికుమార్ ఆచార్యులు, రఘురామ్ ఆచార్యులు, పద్మనాభాచార్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూలతో అలంకరించిన ఊయలలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి, పూలు, పండ్లు, మిఠాయిలను నైవేద్యంగా ఏర్పాటు చేశారు. దంపత తాంబూలం, ప్రసాద వితరణ జరిగాయి. ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహించారు.

సీతారామస్వామి ఆలయంలో..

బోట్‌క్లబ్: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. తొలుత ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో శ్రీపుష్పయాగం నిర్వహించారు. పలువురు భక్తులు శ్రీపుష్పయాగం కోసం స్వామివారికి పువ్వులు, స్వీట్లు, పండ్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మిద్దె ఎక్కిన అద్దె

- నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వైనం
- సాధారణ ప్రజలకు ఇల్లు దొరకడం గగనమే..
- నగటు జీవికి తప్పని భారం



కాకినాడ నగరంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు

బోట్‌క్లబ్: ఒకవైపు పారిశ్రామికంగా, మరోవైపు విద్యారంగంలో రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న కాకినాడ నగరంలో అద్దెకు ఇల్లు దొరకడం గగనంగా మారింది. నగరంలో సుమారు ఐదు లక్షలకు పైగా జనాభా ఉన్నారు. వీరు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం కాకినాడకు వలస వచ్చిన వారు మరో లక్షకు పైగా ఉంటారని కార్పొరేషన్ వర్గాల అంచనా. పిల్లల చదువుల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఉంటున్న వారితో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఆశించిన మేరకు పనులు లేకపోవడంతో జీవనోపాధి కోసం ఇక్కడ వచిన వారు ఇంకొందరు ఉన్నారు. ఇలా ఇతర జిల్లాల నుంచి సైతం కాకినాడ నగరంలో ఏళ్ల తరబడి జీవితాన్ని వెళ్లదీస్తున్న వారు అనేకం. నగరంలో డబుల్ బెడ్రూం ఉన్న చిన్న ఇంటి అద్దె రూ.10 వేలకు తక్కువ కాకుండా ఉంది. దీంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు అద్దెలు చెల్లించాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా అద్దెలు పెరుగుతూ పోవడంతో ఉన్న ఇంటిని ఖాళీ చేసి, వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ల నిర్మాణం

సాగర తీరాన పలు పరిశ్రమలు ఉండడంతో ఇక్కడ ఉద్యోగుల కోసం కంపెనీలు అపార్ట్‌మెంట్లు అద్దెకు తీసుకుని వారికి వసతి కల్పిస్తున్నాయి. సిల్క్‌రోడ్డు సుగర్స్, ఎన్ఎఫ్‌సీఎల్, జీఎఫ్‌సీఎల్, గెయిల్, రిలయన్స్ వంటి సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కాకినాడలో నివాసం ఉంటున్నారు. కంపెనీలు భారీగా జీతాలు ఇస్తుండడంతో అన్ని వసతులు ఉన్న ఇంటిని ఉద్యోగులు కోరుకుంటున్నారు. దీంతో డబుల్ బెడ్రూంతో పాటు, త్రిబుల్ బెడ్రూం ఇళ్లకు ఎంతో గిరాకీ ఉంది. దీంతో పలువురు అపార్ట్‌మెంట్లు నిర్మించి అద్దెలకు ఇస్తున్నారు. ఇళ్ల నిర్మాణం కంటే అపార్ట్‌మెంట్ నిర్మించి అద్దెలకు ఇస్తే ఎక్కువ ఆదాయం రావడంతో, బిల్డర్లు ఎక్కువగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో నగరంలో ఎటు చూసినా అపార్ట్‌మెంట్లు అధికంగా కనిపిస్తున్నాయి.

విద్యాసంస్థల వద్ద కష్టమే..

నగరంలో పేరున్న విద్యాసంస్థలు ఎన్నో ఉన్నాయి. రంగరాయ వైద్య కళాశాల, జేఎన్‌టీయూకే, పీఆర్ కళాశాలతో పాటు, ఎన్నో ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలున్నాయి. దూర ప్రాంతాల నుంచి తమ పిల్లలను కాకినాడకు పంపడం ఇష్టపడని తల్లిదండ్రులు తమ పిల్లలు చదివే సమీప ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలలు, పాఠశాలల సమీపంలో అద్దె ఇళ్లు దొరకడం చాలా కష్టంగా మారింది. ఒకవేళ దొరికినా.. అక్కడ అద్దెలు విపరీతంగా ఉంటాయి. సాధారణంగా డబుల్ బెడ్రూం ఇళ్లు రూ.10 వేలు ఉండగా, విద్యాసంస్థలున్న ప్రాంతంలో రూ.13 వేలకు పైమాటే. దీంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు అక్కడ అద్దెలు చూసి భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

భారీగా పెరిగిన అద్దెలు

కరోనా కారణంగా ఆ మూడేళ్లూ ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళ్లిపోయారు. చాలా మంది అక్కడ నుంచే ఉద్యోగాలు చేయడం, విద్యార్థులు కళాశాలలకు వెళ్లడం చేసేవారు. దీంతో అద్దెకు దిగేవారే కరవయ్యారు. ఆ సమయంలో అద్దెలు గణనీయంగా తగ్గిపోయాయి. ఏడాది కాలంగా పరిస్థితులు మెరుగుపడడంతో, అద్దె ఇళ్ల కోసం వచ్చే వారూ పెరగడంతో, ఇంటి యజమానులు అద్దెలు కూడా పెంచుతున్నారు. మూడేళ్ల క్రితం డబుల్ బెడ్రూం రూ.7 వేల నుంచి రూ.8 వేలు మాత్రమే అద్దె ఉండేది. ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకూ పెరిగింది.

అద్దెలు చాలా ఎక్కువ

మాది శ్రీకాకుళం. నేను ఓ ఇన్‌స్టిట్యూట్‌లో ఎస్సై సెలెక్షన్స్‌కు శిక్షణ తీసుకుంటున్నాను. ఆరు నెలలు ఇక్కడ ఉండాలి. చిన్న గదిలో ముగ్గురు కలిసి ఉంటున్నాం. ముగ్గురు కలిసి రూ.5 వేలు అద్దె చెల్లిస్తున్నాం. వచ్చిన కొత్తలో రూమ్ కోసం చాలా రోజులు అన్వేషించాల్సి వచ్చింది. అద్దె ఇల్లు దొరకడం చాలా కష్టం.



– ఎం.శ్రీకాంత్, నిరుద్యోగి

పిల్లల చదువు కోసం వచ్చాం



మేము పదేళ్లుగా కాకినాడ నగరంలోనే అద్దె ఇంట్లో ఉంటున్నాం. మేము వచ్చిన కొత్తలో రూ.3 వేలకు డబుల్ బెడ్రూం ఇల్లు అద్దెకు దొరికేది. ప్రస్తుతం విద్యుత్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాం. అద్దె నెలకు రూ.12 వేలు. ప్రతి ఏటా అద్దె పెరుగుతున్నా.. పిల్లల చదువు కోసం తప్పడం లేదు.

– మొసలగంటి సురేష్, కాకినాడ

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



యండమూరులో ఊరేగుతున్న చిన్నారులు, పెద్దలు



కాకినాడ రూరల్ రమణయ్యపేటలో క్రైస్తవ భక్తుల సందడి



కాకినాడ దేవాలయం వీధిలో నిర్వహించిన ర్యాలీ



గాంధీనగర్ చిన మార్కెట్ వద్ద మట్టలతో ర్యాలీ



గొర్రిపూడిలో మట్టల ఆదివారంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

కరప: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిల్లో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుప్రభుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల్లో పిల్లలు, పెద్దలు, మహిళలు ఈత ఆకులకు పువ్వులను గుచ్చి, వాటిని చేతపట్టుకుని లోక రక్షకుడు ఏసును ప్రార్థిస్తూ ఊరేగింపు నిర్వహించారు. మట్టల ఆదివారం విశిష్టతను మండల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు పి.సత్యప్రసాద్‌బాబు వివరించారు. చిన్నారులు, క్రైస్తవులు పువ్వులతో అలంకరించిన ఈతమట్టలతో శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గొర్రిపూడి, యండమూరు, పెనుగుదురు, కరప, వేళంగి, నడకుదురు తదితర గ్రామాల్లో పిల్లలు ఊరేగుతూ, చర్చికెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో మండల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రసాద్‌బాబు, సెక్రటరీ డాక్టర్ పి.సామ్యూల్‌రాజు, ట్రెజరర్ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.ఏసు రత్నం, జాయింట్ సెక్రటరీ ఎస్.భరత్‌కుమార్, కె.శేఖర్‌మోజెస్, ఐ.జాన్‌సూర్యప్రకాష్, చైర్మన్ డాక్టర్ స్టీఫెన్‌బాబు తదితరులు ప్రార్థనలు చేశారు.

కాకినాడ రూరల్: క్రైస్తవులు మట్టల ఆదివారం పండగను ఘనంగా జరుపుకొన్నారు. వచ్చే ఆదివారం జరగనున్న ఈస్టర్ పండగను పురస్కరించుకుని ఉపవాస ప్రార్థనలు చేపడుతున్న క్రైస్తవులు గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం నాడు ఉదయమే ఈత చెట్ల కొమ్మలను పూలతో అందంగా అలంకరించి, వీధుల్లో ఊరేగారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు మట్టల ఆదివారం పండగ చేసుకున్నారు. రమణయ్యపేటలో పలు చర్చిలకు చెందిన క్రైస్తవ భక్తులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న ఈత మట్టల ర్యాలీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నగరంలోని పలు చర్చిల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు, చర్చి ప్రతినిధులు, యూత్ ఆధ్వర్యంలో ఈత మట్టలను రకరకాల పూలతో అలంకరించి, వాటితో నగర వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రత్యేక పాటలు పాడుతూ, ప్రార్థనలు చేశారు. కాకినాడ రూరల్, అర్బన్ ప్రాంతాల్లో మట్టల ఆదివారం ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలో అర్బన్ తహసీల్దార్ భవన్ సమీపంలోని క్రెగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, రామారావుపేటలోని సెంయింట్ జాన్స్ లూథరన్ చర్చి, గాంధీనగర్‌లోని హౌస్ ఆఫ్ ప్రేయర్, ఆంధ్రా బాప్టిస్టు చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చి, జగన్నాథపురంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి, రోమన్ కేథలిక్ చర్చి, చీడీలపొరలోని షాలోమ్ ప్రేయర్ హౌస్, రిజర్వ్‌లైన్స్ పోలీస్ క్వార్టర్స్ బాప్టిస్టు చర్చి, ఏపీఎస్పీ యూనియన్ బాప్టిస్టు చర్చి, రేస్ ఆఫ్ పీస్ చర్చి, గైగోలుపాటు లూథరన్ చర్చి, రమణయ్యపేట లూథరన్ చర్చి, క్రెగ్ ఇమ్మానుయేల్ చర్చిల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం జరిగిన ప్రత్యేక ఆరాధనల్లో మట్టల ఆదివారం ప్రత్యేకతను తెలియజేస్తూ ప్రత్యేక ప్రసంగాలు, ప్రార్థనలు చేశారు. నగర వీధుల్లో మట్టలతో నిర్వహించిన ర్యాలీలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుల్లో క్రెగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ డి.వరప్రసాద్, సంఘ నాయకులు డానియేల్ దినకర్ జాసన్, ఎం.వినోద్‌కుమార్, కె.రంజిత్‌కుమార్, రిజర్వ్ లైన్స్ పోలీస్ యూనియన్ చర్చి పాస్టర్ ఎం.చంద్రపాల్, హౌస్ ఆఫ్ ప్రేయర్‌లో పాస్టర్ విజయ్‌కుమార్, గాంధీనగర్ తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ బీవీ రాజు, బెరాకా బెస్సింగ్స్ చర్చిలో పాస్టర్ జోసఫ్‌బెన్ని, షాలేమ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ శామ్యూల్ విక్టర్, రేస్ ఆఫ్ పీస్ చర్చిలో పాస్టర్ మూర్తిరాజు, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపంతో పురుగు మందు తాగిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు, కరప మండలం వలసపాకల గ్రామానికి చెందిన చాట్ర అప్పారావు(38) ప్రకాశం జిల్లా అద్దంకిలో ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. భార్య, ముగ్గురు అమ్మాయిలతో అక్కడే నివసిస్తున్నాడు. పది రోజుల క్రితం భార్యతో గొడవపడి సొంతూరు వలసపాకలలోని తల్లి వద్దకు వచ్చాడు. భార్య వీరమణిని పిలిచినా తన వద్దకు రావడం లేదన్న మనస్థాపంతో ఈ నెల 9న అప్పారావు మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగాడు. వాంతులు చేసుకుంటున్న అతడిని తల్లి సౌదామణి చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించింది. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు లేవు

- కొనేవారు లేక దళారులకు విక్రయాలు
- ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- మాజీ ఎంపీ వంగా గీత వద్ద రైతుల ఆవేదన



వంగా గీతకు తమ సమస్యలు వివరిస్తున్న రైతులు

పిఠాపురం: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనేవారు లేక దళారులు పాలు చేయాల్సి వస్తుందని, అప్పులపాలై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత ఆదివారం గొల్లప్రోలు మండలం చేబ్రోలు, లక్ష్మీపురం, సీతానగరం, మల్లవరం గ్రామాల్లోని దాళ్వా సాగు చేసిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలును తెలుసుకున్నారు. గిట్టుబాటు ధర లేదని, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఈ సందర్భంగా రైతులు ఆమె వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు రైతులు, కౌలు రైతులు మాజీ ఎంపీ గీత వద్ద తమ సమస్యలు ఏకరువు పెట్టారు. గతేడాది సాధన వరి రకం బస్తా రూ.1,700కు, ఓం సాయి రకం రూ.1చ800 వరకు కొనుగోలు చేశారని, ఈ ఏడాది రూ.1,250కు మించి కొనుగోలు చేయడం లేదని పలువురు రైతులు తెలిపారు. అది కూడా నెల అరువు పద్ధతిలో అమ్మకం చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. బస్తాకు రూ.500 చొప్పున ఎకరాకు రూ.20వేలు నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. ఇంత దారుణమైన పరిస్థితి ఎన్నడూ లేదన్నారు. రైతుల్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల తీవ్ర నష్టాలు పాలవుతున్నారని, ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నామని రైతులు ఆమె వద్ద వాపోయారు. అన్నదాతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల తీవ్ర మనస్తాపానికి గురవుతున్నామని చెప్పారు.

గత ప్రభుత్వంలో నయం

గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధైర్యంగా ధాన్యాన్ని అమ్ముకునే వారమని, గిట్టుబాటు ధర వచ్చి.. ఇబ్బందులు, నష్టాలు లేకుండా లాభాలతో వ్యవసాయం చేసేవారమని రైతులు తెలిపారు. ఇప్పుడు ధాన్యం కొనేవారు లేక, అప్పుల పాలయ్యే పరిస్థితిలో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని వంగా గీతను వేడుకున్నారు. రైతుల సమస్యలు సావధానంగా ఆలకించిన ఆమె వెంటనే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు ఫోన్లు చేసి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఒకవైపు ధర లేక, మరోవైపు వాతావరణంలో మార్పుల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు, తక్షణం అధికారులు స్పందించి, ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. దీనిపై మిల్లర్లు, అధికారులతో మాట్లాడి, వెంటనే రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

జూదరుల అరెస్టు

కొత్తపల్లి: పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు, గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు శివారు ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై రామకృష్ణ వెంకటేష్ తమ సిబ్బందితో దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి, రూ.10,850 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అకాల వర్షంతో బీభత్సం

కొత్తపల్లి: ఆకస్మికంగా మారిన వాతావరణంతో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సాన్ని సృష్టించింది. అకాల వర్షం, ఈదురు గాలులతో పాటు పిడుగులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో చెట్లు కూలాయి. దీంతో తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనేక గ్రామాలు అంధకారంగా మారాయి. అకాల వర్షంతో రైతులు బెంబేలెత్తారు.

హడలిపోయిన ప్రజలు

సామర్లకోట: ఆదివారం రాత్రి ఆకస్మికంగా ఈదురు గాలులు, భారీ వర్షం బీభత్సం సృష్టించడంతో ప్రజలు హడలిపోయారు. ఈదురు గాలులకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తర్వాత ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురవడంతో, ప్రయాణికులు ఎక్కడికక్కడే వాహనాలను నిలిపి సురక్షిత ప్రాంతాలకు చేరారు. ఈ క్రమంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ అధికారులు ముందుజాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.

శ్రీరాముని గుణగణాలు అనుసరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణవాణి

బోట్‌క్లబ్: శ్రీరాముని గుణగణాలు అందరూ అనుసరించాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా సంస్కృత ప్రచార్ విభాగ్ అధ్యక్షురాలు చల్లా శ్రీకృష్ణవాణి అన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో ఉగాది నుంచి ప్రారంభమైన శ్రీరామోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శ్రీరాముడు వ్యక్తిత్వ లక్షణాలు సమాజంలో అందరికీ ఆదర్శప్రాయం కావాలన్నారు. సమాజానికి అత్యున్నత విలువలున్న వ్యక్తులు అవసరమన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆర్ రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ, శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఉదయభానోజీరావు, సత్య శ్రీదేవి, భవాని, సునీత పాల్గొన్నారు.

ముగిసిన మహోత్సవాలు

కాకినాడ రూరల్: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రమణయ్యపేట అడబాల ట్రస్ట్ నిర్వహించిన శ్రీరామ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. సంస్థ జిల్లా కన్వీనరు రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ, శ్రీరాముని జీవితం, కుటుంబ ప్రబోధం సమాజం ఆచరించాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేయూత భవన్‌కు కూలర్ అందజేత



వాటర్ కూలర్ అందిస్తున్న కృష్ణప్రకాష్

బోట్‌క్లబ్: రోటరీ చేయూత భవన్ విద్యార్థులకు వేసవిలో చల్లటి తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో రోటరీ గోల్డెన్ జూబ్లీ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది జీవీ కృష్ణప్రకాష్ వాటర్ కూలర్‌ను ఆదివారం అందజేశారు. చేయూతలో ఆశ్రయం పొందుతూ విద్యను అభ్యసిస్తున్న సుమారు 50 మంది విద్యార్థులకు వేసవిలో చల్లటి మంచినీరు, చలికాలంలో వేడి మంచినీరు వచ్చే విధంగా మల్టీపర్పస్ కూలర్ ఉపయోగపడుతుందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మొండి రవికుమార్ అన్నారు. ఇంటర్ ఫలితాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేయూత సంస్థ ద్వారా సాయం పొందిన విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారన్నారు. విద్య, వైద్య, క్రీడా, సేవా రంగాలతో పాటు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా చేయూత సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. కూలర్ అందజేసిన కృష్ణప్రకాష్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

జలియన్ వాలాబాగ్ మృతులకు నివాళులు



రమణయ్యపేటలో జలియన్ వాలాబాగ్ మృతులకు నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: బ్రిటిష్ సైనికులు భారత స్వాతంత్ర ఉద్యమకారులపై జలియన్ వాలాబాగ్‌లో ఊచకోత బాధకరమని, ఆ దుర్ఘటనను భారతీయులు మరవలేరని గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతకాయల సుబ్బారావు అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జలియన్ వాలాబాగ్ మృతులకు ఆత్మశాంతి కలగాలని నివాళులర్పించారు. జలియన్ వాలాబాగ్ దుర్ఘటన తరువాత భగత్ సింగ్ విప్లవ కారుడుగా మారారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: జలియన్ వాలాబాగ్ ఘటనలో అసువులు బాసిన భారతీయులకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం నివాళులర్పించారు. ఈ ఘటన ఆంగ్లేయులు పరిపాలనకు వ్యతిరేకంగా 1920లో సహాయ నిరాకరణ ఉద్యమానికి నాంది పలికిందన్నారు. భగత్‌సింగ్‌తో పాటు, ఉద్ధంసింగ్ వంటి పలువురు విప్లవకారులుగా మారడానికి కూడా ఈ సంఘటనే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చైతన్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.